క్లుప్తంగా

విద్యార్థినులకు ఉపకార వేతనాలు పంపిణీ



గుంటూరురూరల్: నగర శివారులోని అమరావతి రోడ్డులోని రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి గృహంలో ఆంధ్రప్రదేశ్ తెలగ అభ్యుదయ సంఘం (ఆప్తా) ఆధ్వర్యంలో కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేపట్టారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆప్తా మెంబర్ సింగంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు గోన శివ, బెల్లకొండ ప్రభాకర్, విజేత శ్రీహరి, స్పెక్ట్రం ఐఏఎస్ అకాడమీ అధినేత పోతురాజు, ప్రణయ్, నారిశెట్టి కృష్ణారావు, శోడ శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గా వద్ద అన్న సంతర్పణ



పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులందరికీ ఆదివారం రాత్రి అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. వారిలో కొందరు రాత్రి వేళల్లో దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేసి ఆ తరువాత రోజు ఇళ్లకు బయలు దేరి వెళుతుంటారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో ఆదివారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ భాషా భోజనం ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే పేరిట భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ స్టార్ మస్తాన్, జాయింట్ సెక్రటరీ సుబాని, గుంటూరు కార్పొరేటర్ మీరావలి, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శివసాయి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో విజయవాడ, గుంటూరు గాయకుల సహకారంతో అభినందన ఫౌండేషన్ అనాథ శరణాలయం సహాయార్థం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయనిలు మునిపల్లె రమణి, నేరెళ్ల చందన, అత్తోట సౌజన్య, బెల్లంకొండ భారతి, జరీన కమల్, విజయలక్ష్మి సినీ పాటల్ని ఆలపించారు. అనంతరం నిర్వాహకులు గాయనిలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యస్. శివనాగేశ్వరరావు, బిల్ల అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందపేట 7వ లైన్‌లో నివసించే షేక్ నజీర్ (30) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ 24వ లైనుకు చెందిన 28 సంవత్సరాల మేడా మరియమ్మ ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామిరెడ్డినగర్‌లో బాలిక...

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్ 1వ లైన్‌లో నివసించే 14 సంవత్సరాల బాలిక ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 86888 31340కు సమాచారం ఇవ్వాలని కోరారు.



పొన్నూరు నుంచి 'సిద్ధం' సభకు బయలు దేరిన కార్యకర్తలు



పార్టీ నాయకులతో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మురళీకృష్ణ



నల్లపాడులో బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి

'సిద్ధం' సభకు తరలిన జగనన్న సైన్యం

- పొన్నూరు నుంచి వేలాదిగా వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- బస్సులో ప్రయాణించి కార్యకర్తలతో సందడి చేసిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడులో నిర్వహించనున్న 'సిద్ధం' బహిరంగ సభకు పొన్నూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణం, మండలం, పెదకాకాని, చేబ్రోలు మండలాల నుంచి దాదాపుగా 150 బస్సులు, 40 కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు బయలుదేరారు. వాహనాలను సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పార్టీ జెండాను ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, దీనికి 'సిద్ధం' బహిరంగ సభలే నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ పాలనపై బురదజల్లేందుకు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు విశ్వసించడం లేదని స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజలను తీవ్రంగా మోసగించారని, మరోసారి మోసం చేసి అధికారం చేజిక్కించుకోవాలని చేసే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ నాయకుడికి లేనంత ప్రజాభిమానం సీఎం వైఎస్ జగన్‌కు ఉందన్నారు. మీ ఇంట్లో మేలు జరిగితేనే ఓటు వేయమని చెప్పే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరేనని అన్నారు. మళ్లీ ఆయననే సీఎంగా గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన అందిస్తున్న సంక్షేమ పాలనతో రాబోయే ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని అన్నారు. 'సిద్ధం' బహిరంగ సభకు మండలంలోని చిన్న గ్రామాల నుంచి రెండు బస్సులు, పెద్ద గ్రామాల నుంచి మూడేసి బస్సుల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్లారు. మరికొంత మంది సొంత వాహనాలు, బైకులపై వెళ్లారు. రెట్టించిన ఉత్సాహంతో జై జగన్.. జైజై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. సభకు వెళ్లిన వారికి భోజనం, వాటర్ బాటిళ్లు అందించారు. సమన్వయకర్త మురళీకృష్ణ సభకు బస్సులో ప్రయాణం చేసి కార్యకర్తలతో సందడి చేశారు. పొన్నూరు మాజీ చైర్‌పర్సన్, బాపట్ల పార్టీ పరిశీలకులు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, షేక్.నాజర్, పీఏసీఎస్ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వరరావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, వడ్రాణం ప్రసాదు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు వెళ్లారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



వంట చేస్తున్న అంబటి మురళీకృష్ణ



బస్సును నడిపి ప్రారంభిస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

దారులన్నీ జగనన్న 'సిద్ధం సభ' వైపే

బస్సులను నడిపి ప్రారంభించిన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడులో జరిగే 'సిద్ధం' సభకు నియోజకవర్గ వ్యాప్తంగా లక్షలాదిగా వైఎస్సార్ సీపీ శ్రేణులు స్వచ్ఛందంగా బయలుదేరారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు బయలుదేరిన బస్సులను నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఏటుకూరు బైపాస్ వద్ద ఆయనే స్వయంగా బస్సును నడిపి ప్రారంభించారు. పార్టీ నాయకులు శ్రేణులతో కలిసి బస్సుల్లో ప్రయాణించి జగనన్నపై తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బలసాని మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పాలనతో సంతోషంగా జీవించాలని ఎన్నికల కోసం 'సిద్ధ'మయ్యారన్నారు. గుంట నక్కల వలే అన్ని పార్టీలు మూకుమ్మడిగా చంద్రబాబు కుట్రలకు బలయ్యే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. చంద్రబాబుకి ఇవి చివరి ఎన్నికలని అందుకే అన్ని పార్టీలను బ్రతిమాలుకుని ఎన్నికలకు పోతున్నాడన్నారు. ప్రజలంతా తమకు మంచి చేసే జగనన్నకే మద్దతు తెలియజేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆయనను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు 'సిద్ధం'గా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సిద్ధం' సంబరాలు..

మేదరమెట్లలో జరిగే సిద్ధం సభకు మండలంలోని గ్రామాల్లోని ప్రజలు తండోప తండాలుగా బస్సుల్లో స్వచ్ఛందంగా బయలుదేరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు సభలకు బయలుదేరే వైఎస్సార్ సీపీ శ్రేణులకు జెండాలను ఊపి ప్రారంభించారు.

అభిమాన నేతను చూచేందుకు తరలిన శ్రేణులు

కాకుమాను: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న 'సిద్ధం' సభకు కాకుమాను మండలం నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం మండల కేంద్రం కాకుమానులో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్ ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కపిల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు వెళుతున్న బస్సులను పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



వడ్లమూడి నుంచి బైకులపై ర్యాలీగా 'సిద్ధం' సభకు వెళుతున్న యువత

'సిద్ధం' సభకు తరలిన యువత

చేబ్రోలు: 'సిద్ధం' సభకు చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివారం భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలి వెళ్లారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పర్యవేక్షణలో చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల నుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. చేబ్రోలు, మంచాల, వడ్లమూడి, వేజండ్ల, వీరనాయకునిపాలెం, శలపాడు, శేకూరు, నారాకోడూరు, సుద్దపల్లి, తోట్లపాలెం, శ్రీరంగపురం, గుండవరం, గొడవర్రు గ్రామాల నుంచి సభకు ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ఉదయం నుంచే పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బహిరంగ సభకు వెళ్లే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్థానిక నాయకులు తగిన ఏర్పాట్లు చేశారు. వడ్లమూడి వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు, కార్యకర్తలు సభకు బైకులపై ర్యాలీగా తరలివెళ్లారు.



'సిద్ధం' సభకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కపిల్



చేబ్రోలు మండలం మంచాల నుంచి 'సిద్ధం' సభకు వెళుతున్న నాయకులు



చేబ్రోలు నుంచి బస్సులో సభకు వెళుతూ విజయ సంకేతాన్ని చూపుతున్న యువకులు



చేబ్రోలులో 'సిద్ధం' పోస్టర్లను ప్రదర్శిస్తున్న యువత

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- ముగిసిన 47వ హోసన్న అంతర్జాతీయ గుడారాల పండుగ ప్రార్థనలు
- 20 లక్షల మందికి పైగా పాల్గొన్న క్రీస్తు భక్తులు



గుంటూరు రూరల్: ఏసు క్రీస్తు ఆయన కృపను భక్తులందరిపై కుమ్మరిస్తాడని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీలు తెలిపారు. గత నాలుగు రోజులుగా గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం ముగింపు ప్రార్థనలను పాస్టర్ జేమ్స్ ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్స్ సిస్టర్స్ యధాస్తుతి గోత్రపు సింహాసనం, పరలోక తేజస్సు అనురాగ పూర్ణుడా అని క్రీస్తుని స్తుతి గీతాలను ఆలపించారు. పాస్టర్ జాన్‌వెస్లీ క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ క్రీస్తు భక్తులు హిమము వలే పరిశుద్ధంగా ఉండాలన్నారు. క్రీస్తు మాటలు పరిమళంతో కూడి ఉంటాయని ఆయన మనలను పరిశుద్ధ పరుస్తాడన్నారు. ఆయన గుడారంలో ఉన్న భక్తులందరికీ నిత్యం జీవం కలుగుతుందని తెలిపారు. దేవుని గుడారం సౌందర్యవంతంగా ఉంటుందని చెప్పారు. క్రీస్తుని నమ్మినవారికి విజయాలు సొంతమవుతాయన్నారు. బ్రదర్ అబ్రహాం క్రీస్తు సందేశాన్ని అందిస్తూ ఏసు క్రీస్తు ఆయన కృపను ఆయన భక్తులు ప్రతి ఒక్కరిపై కురిపిస్తాడన్నారు. క్రీస్తు మార్గం సత్యం, జీవం, పరిశుద్ధమైనదని చెప్పారు. ఆయన భక్తులు ఆయన వలె ప్రేమను కలిగి ప్రతి ఒక్కరికి ప్రేమను పంచాలన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో దేశ విదేశాలనుంచి 20 లక్షల మందికి పైగా క్రీస్తుని భక్తులు పాల్గొని క్రీస్తు నామాన్ని ఘన పరుస్తూ స్తుతి గీతాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హోసన్న, హల్లెలూయ అంటూ ఆ ప్రాంతం మార్మోగింది. రైల్వే, ఆరోగ్యశాఖ, పోలీసులు, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, రాజకీయవేత్తలు, ఆర్టీసీతో పాటు ప్రతి విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రతి భక్తుడు సురక్షితంగా ఇంటికి చేరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్స్ పైడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్, మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ధర్మచంద్రారెడ్డి

గుంటూరు రూరల్: చదరంగం మేధో సంపద క్రీడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల మౌలిక కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చదరంగం పోటీలలో పాల్గొనటం వల్ల క్రీడాకారుల్లో మేధస్సు, నైపుణ్యతలు పెంపొందించు కోవచ్చన్నారు. పోటీ తత్వం పెరుగుతుందని తెలిపారు. చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలలో వివిధ జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలను శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సౌజన్యంతో చలపతి ఫార్మసీ కళాశాల, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించటం సంతోషకరమన్నారు. ఈ పోటీలు 7 రౌండ్లలో జరుగతాయని గెలుపొందిన వారికి రూ.53 వేలు నగదు బహుమతి అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుడు, అకాడమీ డైరెక్టర్ ఎమ్ గోపినాథ్‌, పీడీలు పీ భానుప్రకాష్, ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగేశ్వరస్వామి రథోత్సవం

శివ నామస్మరణతో మారోగ్మిన పురవీధులు

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి గాంచిన చేబ్రోలులోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల హర నామ స్మరణతో ఆదివారం స్థానిక పుర వీధులు పునీతమయ్యాయి. సుమారు వంద సంవత్సరాల క్రితం నాటి పురాతన భారీ రథంపై ఊరేగుతున్న గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి కల్యాణమూర్తులను దర్శించుకోవటం కోసం చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి ప్రజానీకం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. నాగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా కల్యాణోత్సవాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. పాత పోలీసు స్టేషన్ సమీపంలో కొద్ది సేపు రథాన్ని ఆపి గంగానమ్మ తల్లికి పూజలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు రథోత్సవం సందర్భంగా పులిహోర, మజ్జిగ తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. చేబ్రోలు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు రథం తాడును లాగటానికి ఉత్సాహం చూపారు. దేవదాయశాఖ ఈవో పోతుల రామకోటేశ్వరరావు రథోత్సవ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గుంటూరుకు చెందిన మహిళా భక్త సమాజం వారు ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



పురాతన రథంలో పుర వీధుల్లో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఏడుకొండలు

గుంటూరు రూరల్: సహ జీవనం చేసిన మహిళ పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు మండలం వెనిగళ్ల గ్రామానికి చెందిన చల్లా ఏడుకొండలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గతంలో కృష్ణా జిల్లా ఏ కొండూరు మండలం కంభంపాడుకు చెందిన సౌజన్యతో కలసి ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఎంటెక్ చదివాడు. చదువుకున్న రోజుల్లో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. సౌజన్య గతంలో వివాహం చేసుకొని భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఇరువురుకి విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రావడంతో ఇద్దరూ హైదరాబాద్ వెళ్లారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ ఇద్దరూ సహజీవనం చేశారు. ఈ క్రమంలో సౌజన్య హైదరాబాద్‌లో ఫిబ్రవరి నెలలో ఏడుకొండలు తనను పెళ్లి చేసుకోవడం లేదని, తనపై అత్యాచారం చేశాడంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఏ కొండూరు మండల పోలీసు స్టేషన్‌లోనూ ఏడుకొండలపై సహ జీవనం చేస్తూ మోసం చేశాడంటూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఏడుకొండలు గుంటూరులో ఉన్న తన అక్క ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్తూ నగర శివారులో పొలంలో పురుగుల మందు సేవించాడు. సౌజన్య తనను వేధిస్తుందని లైవ్ వీడియో రికార్డు చేసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు పంపాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై నల్లపాడు పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

నేడు వార్షిక బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగానూ నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశాన్ని సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నిర్వహించనున్నట్లు మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సభలో నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌నను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరవుతారని ఆయన తెలిపారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో చేపట్టిన వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక నగరపాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువతరం పాత్ర, దేశాభివృద్ధికి ఆవశ్యకతను తెలియజేశారు. గ్రామాలు, వార్డులలో సామాజిక సేవా కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా విద్యార్థులు ప్రజలతో మమేకం కావడంతో విద్యాపరంగా, సామాజికంగా ముందుకు వెళతారని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ కార్యక్రమ నిర్వహణాధికారిణి సంతోష్‌కుమారి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.